# పీడకల

రామభద్రయ్యకు తెల్లవారుఝామున తాను చనిపోయినట్టు, పచ్చటి వెదుళ్లతో కట్టిన పల్లకీమీద తన శవాన్ని శ్మశానానికి తీసుకుపోయి దహనం చేసేసినట్టూ కలొచ్చింది. త్రుళ్లిపడి చటుక్కున పక్కమీంచి లేచి కూర్చున్నాడు. అరచెయ్యిపెట్టి ఊపిరి వస్తున్నదీ లేనిదీ చూసుకున్నాడు. తన శరీరమంతా చేతులతోరాసి తను నిక్షేపంలా వున్నట్టు ధృవపరచుకొని, ఎదురుగావున్న దేవుడి పటానికి దండంపెట్టుకుని 'ఛ, పాడుకల. రాకరాక తెల్లారగట్ల వచ్చింది' అనుకున్నాడు.

రామభద్రయ్యకు తరుచు కలలొస్తూంటాయి. టాటా షేర్లూ, బిర్లాషేర్లూ సడన్‌గా పెరిగినట్టూ, పడిపోయినట్టూ, ధాన్యంధర, కందుల ధర వెండిధరతోబాటు పెరిగినట్టూ, కొత్తబడ్జట్‌లో ఆముదంమీద, ఆవాల మీద, అప్పడాలమీద పన్నులు వేసినట్టూ, ఇన్‌కమ్‌టాక్సు, సర్‌చార్జీ శాతం పెంచినట్టూ, సేల్స్‌టాక్సు ఆఫీసరు మొండికెత్తి కేసు వేసినట్టూ, వేరుసెనగ, నూనెమిల్లు కూలీలు సమ్మెచేసినట్టూ—ఇలాగే రోజుకొక కలవస్తూ వుంటుంది. ఒక్కొక్క కలతో తన తలమీద ఒకొక్క వెంట్రుక తెల్లబడిందేమోనని అతని అనుమానం. కాని తన శవాన్ని మోసుకెళ్లినట్టు ఎప్పుడూ కలరాలేదు. అందులోకి తెల్లారగట్ల వచ్చిన కలలు నిజమవుతాయంటారు.

విశాలమైన మంచంమీద ఫోమ్‌రబ్బరు పరుపుమీద తన ప్రక్కనే గాఢనిద్ర పోతున్న విల్లీ వేపు చూశాడు రామభద్రయ్య. విల్లీ అదృష్టవంతురాలు. ఏ చింతా లేకుండా గాఢంగా నిద్రపోగలదు. యవ్వనం గడచిపోయినా శరీరపటుత్వం ఇంకా సడలిపోలేదు. ఒక్కతల వెంట్రుక కూడా నెరియలేదు. ఎందుకంటే విల్లీది చీకూ చింతా లేని బ్రతుకు. తన

ప్రాపకంలోకి వచ్చినది లగాయితూ విల్లీకి చీకూ చింతా వుండవలసిన అవసరమేముంది? అందుకే పాడుకల లెప్పుడూరావు. తెల తెలవారుతూంది. కిటికీలోంచి వగటివెలుగు వలచగా గదిలోకి రావడానికి ప్రయత్నిస్తూంది. మంచంమీంచి లేచి రామభద్రయ్య కిటికీ తెరలు తొలగించాడు. దూరంగావున్న చింతతోపుమీద తెల్లటి దూదికప్పినట్టు పొగమంచు కమ్ముకుంది. చింతతోపు ప్రక్కనేవున్న గుడిసెల మధ్యలోంచి ఏదో భజన వినిపిస్తూంది. రామభద్రయ్య ఓ నిముషం శ్రద్ధగా విన్నాడు. అవును, సందేహంలేదు. అది చావుభజన. మధ్యలో ఏడుపులు కూడా వినిపిస్తున్నాయి. రామభద్రయ్యకు తనకొచ్చిన పీడకల మళ్ళీ జ్ఞాపకమొచ్చింది. వెంటనే కిటికీ తలుపులు మూసి గదిలోకొచ్చి కూర్చున్నాడు. తన కలలోని వివరాలు మరచిపోదామని ప్రయత్నించినా సాధ్యం కావడంలేదు.

తనకు ఏభై ఏళ్లుదాటినా ఎంతో ఆరోగ్యంగా, దృఢంగావున్నాడు. మొన్న మొన్ననే డాక్టరొచ్చి పరీక్షచేసివెళ్లేడు. ప్రతినెలా ఏరోగం లేకపోయినా డాక్టరొచ్చి పరీక్షచేసి వెళ్తాడు.

"భద్రయ్యగారూ, ఏదో అలవాటుకొద్దీ పరీక్షచేయడమేగాని మీ ఆరోగ్యాని కేమండీ. నిక్షేపంలావుంది. ఆమాటకొస్తే మాకంటే మీరే ఆరోగ్యవంతులు," అన్నాడు డాక్టరు.

నిజానికి తన ఆరోగ్యం తనకెంతోగర్వకారణం. ఎదురుగావున్న నిలువుటద్దం ముందుకెళ్లి నుంచున్నాడు. తలవెంట్రుకలు నెరసినవ్పటికీ కండలుతిరిగిన తన శరీరం చూస్తూంటే ముచ్చటేసింది. ఏళ్లుగడుస్తున్న కొద్దీ వృద్ధిపొందుతున్న తన ఐశ్వర్యంలాగానే తన ఆరోగ్యంకూడా గట్టిపడుతూందేమో ననిపించింది. ఇప్పుడు తనకొచ్చిన పీడకలకు అర్థం లేదనిపించి గట్టిగా తనలో తానే నవ్వుకున్నాడు.

విల్లీకి తెలివొచ్చినట్టుంది. కళ్లువిప్పి రామభద్రయ్యవేపుచూస్తోంది. కాని అతనెందుకు అద్దంముందు నిలుచుని నవ్వుకున్నాడో అర్థంకాలేదు. అతనెందుకు తన కండరాలనూ ఛాతీనీ చూసుకుంటున్నాడు? తనేం పైల్మాన్ అనుకుంటున్నాడా? లేకపోతే నవయువకుడి ననుకుంటున్నాడా? రామభద్రయ్య సంగతి విల్లీకి తెలుసు. అందుకే తనలో తానే నవ్వుకుంది.

విల్లీ మంచంమీద లేచి కూర్చున్నట్టు అద్దంలో కనిపించగానే రామభద్రయ్య చటుక్కున వెనక్కితిరిగాడు. గాఢమైన నిద్రపోవడంవల్ల విల్లీ మొహం తేటగావుంది. తలవెంట్రుకలు మాత్రం చెదరి మొహం మీద పడుతున్నాయి. విల్లీ ఎందుకో నవ్వుతూంది.

'ఎందుకు విల్లీ నవ్వుతున్నావ్?'

'అద్దముందు నిలుచుని మీలో మీరు నవ్వుకుంటూంటే నాకు నవ్వొచ్చింది.'

'అదా, అదేంలేదు, నాకు తెల్లారకట్ట నేను చచ్చిపోయినట్టు కలొచ్చింది.'

"అయితే మరేం మీకు నూరేళ్ళాయుస్సు."

'అదేమిటి?'

'చచ్చిపోయినట్టు కలొస్తే శనివిరగడైనట్టని అంటారు. అలాంటి వారికి మరి చావుండదట.'

'అయితే మరి నాకు చావేవుండదంటావా?'

'ఉండదు' అంటూ గట్టిగా నవ్వింది విల్లీ.

'నా చావు విషయం నీకో నవ్వులాటగావుంది.'

'ఏదో కలొచ్చిందని దిగులుపడుతున్నారు. మీకు చావంటే బలే భయంలావుందే'

'నీకు భయంలేదా ?'

"అందరిలాగే నాకూ ప్రాణమంటే తీపేగాని చావంటే మీలా బెదిరిపోను .మీకు మీ ఇళ్లూ, వాకిళ్లూ, ఐశ్వర్యమూ అంతావదిలి పోవలసి వస్తుందని భయం. కాని నాకేం భయం ?"

''పెద్ద వేదాంతిలా మాట్లాడుతున్నావే."

'సరేలెండి. పొద్దెక్కుతూంది, పదండి, మొహం కడుక్కొని కాఫీతాగాలి. ఆకలేస్తూంది. బతికినన్నాళ్లూహాయిగా కాఫీతాగుదాం' అని నవ్వుతుంటూ విల్లీ మేడదిగి వెళ్లిపోయింది.

రామభద్రయ్య కాఫీ ఫలహారం సేవించి వార్తాపత్రిక చదివేడు. పత్రికలో తనకు మంచివార్తలుగాని, చెడ్డవార్తలుగాని ఏమీ కనిపించ లేదు. తన వ్యాపారం జోలికిగాని, తన ఆస్తుల జోలికిగాని ఎవరూ రానంతకాలం ఎవరెలాపోయినా తనకేంబాధలేదు. మోటారుకార్ల ధరలు పెంచారట. అది తాజావార్త. అన్ని వస్తువుల ధరలూ పెరగడమేగాని తరిగే సూచనలు లేనందుకు అతనికెంతో తృప్తికలిగింది.

గేటుదగ్గర ఎవరో ''బాబూ, బాబూ" అని కేకలేస్తున్నారు. రామభద్రయ్య కిటికీలోంచి తొంగిచూశాడు. ఎవరో పదిమంది గేటు దగ్గర నిలుచునివున్నారు. అతను మేడదిగి వీధి వరండాలోకి వచ్చాడు. కాపలావాడొచ్చి మిల్లుకూలీలు ఏదో చందాకోసం వచ్చారని చెప్పాడు. రామభద్రయ్యకి ఆశ్చర్యంవేసింది. ఇంత పొద్దున్నే చందా ఏమిటో అర్థంకాలేదు. లోపలికి రమ్మన్నాడు. వాళ్లు తన వేరుసెనగ నూనె మిల్లులో పనిచేసే కూలీలు. చింతతోపు ప్రక్క గుడిసెల్లో వుంటారు.

"దండాలు బాబూ, తమరు ఘనంగా దానంసెయ్యాల" అందులో ఒక ముసలివాడు.

"ఏమిటి సంగతి? ఇంత ప్రొద్దున్నే దానమేమిట్రా?" అన్నాడు రామభద్రయ్య.

"రాత్రి రంగన్న సచ్చిపోనాడుబాబూ. భజన పెట్టించినాము. శవాన్ని దహనం సెయ్యాలంటే అదిపెళ్ళాంకాడ సిల్లిగవ్వలేదు. అందుకే సందాలెత్తుతున్నాం."

"ఏమిటీ, రంగన్న చచ్చిపోయాడా?" అంటూ రామభద్రయ్య ప్రక్కనేవున్న కుర్చీలో కూలబడ్డాడు.

రంగన్న రామభద్రయ్యకు బాగాకావలసిన మనిషి. మిల్లు కూలీలను బెదరించో, బ్రతిమాలో మంచికబుర్లుచెప్పో ఎలాగో సముదాయించు కొచ్చేవాడు. కూలీలు సమ్మెచేయకుండా కాపాడుకొచ్చాడు. బయట నుండి ఏ రాజకీయ నాయకుడూ గుడిసెలలోకి రాకుండా అరికట్టేవాడు. అందుకే వాడికి తను పాతికా పరకా పారేసేవాడు.

"వాడింట్లో చిల్లిగవ్వలేదా" అన్నాడు రామభద్రయ్య.

"లేదు బాబూ, మాకు తెలీదా? సచ్చేముందు మాతో సెప్పుతున్నాడు బాబూ. తమకాడ వందా ఏబై పుచ్చుకునేవాడట. కాని అంతా తాగేసి, జలసా చేసేసేవోడు."

"నేను వాడికి డబ్బు ఇవ్వలేదే."

"అదే సెప్పినాడు బాబూ. కూలోళ్లనోళ్లు మూయించడానికని తమరిచ్చేవోరట."

"ఛ. అబద్ధాలు. దొంగవెగధవ బతికుంటే నరికి పారేద్దును. తాస్కెల్"

"సచ్చిపోయినాడ్ని తిడతారేటి బాబూ. వదో పాతికో వదేయండి పొద్దెక్కిపోతూంది."

రామభద్రయ్యకు చాలకోప మొచ్చింది. రంగన్న బతికినన్నాళ్ళూ తనదగ్గర డబ్బుతిని చచ్చేముందు ద్రోహంచేశాడు. ఇలాంటి వెధవ చావుకి తను చందా ఇవ్వాలా? నీచపు వెధవకి విశ్వాసంలేదు.

"పొండిరా, పొండి, ఇవాళ ఏకాదశి. పొద్దున్నే దహన క్రియలకి డబ్బు ఇవ్వకూడదు."

"ఇదేటి బాబూ, ఏకాసినాడు మీ ఇంట్లో ఎవరేనా కాలం నేస్తే దహనం సెయ్యడం మానేస్తారేమిటి?"

"ఛీ, వెధవల్లారా, నోటి కెంత మాటొస్తే అంతే. పొండి ఇవ్వకూడదన్నా నంతే, వెళ్ళండి. కావాలంటే రేపు రండి."

"బాగా సెలవిచ్చారు బాబూ, రేపు ఇంకోడి కోసం రమ్మంటా రేటి? సరే పోనిండి, మరేటిసేత్తాం, బతికి నన్నాళ్ళు అదుమిమ్మల్ని, నమ్ముకున్నాడు, సచ్చేముందు మమ్మల్నినమ్ముకున్నాడు. దిక్కులేనోడు, అడ్ని మేమే తీసుకు పోతాం కాటికి" అంటూ వెళ్ళి పోయారు కూలీలు.

రామ భద్రయ్య నిర్ఘాంతపోయి, వాళ్ళు వెళ్ళిన వేపే చూస్తున్నాడు. వీళ్ళు రంగన్న చెప్పిన సంగతులన్నీ ఊళ్లోసాటుతారు. తన మీద ప్రచారం సాగుతుంది. ఇక సమ్మెలూ అల్లర్లూ ఎలాగూ తప్పవు. ఎన్నో సంవత్సరాలై తన మిల్లులో అల్లర్లు లేవు. అందుకు పెద్ద లందరూ తనను అభినందించారు కూడాను కూలీలకు వాళ్ళ శక్తివాళ్ళకు తెలియనంత కాలం తనకి భయం లేక పోయింది. కాని ఇక మీదట అలా జరుగుతుందా? నిజానికి రంగన్న చావు తన చావు కొచ్చినట్లుంది.

ఎల్లి కప్పుతో కాఫి తెచ్చి అందించింది. ఎల్లి పెదవుల మీది చిరునవ్వు చూడగానే ఆతనికి పొద్దున్నొచ్చిన పీడకల మళ్ళీ జ్ఞాపక మొచ్చింది.